క్లుప్తంగా

ఎమ్మెల్యే పరామర్శ



ఆత్మ చైర్మన్‌ను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే జోగారావు

పార్వతీపురం టౌన్: పార్వతీపురం నియోజకవర్గానికి చెందిన వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు, ఆత్మ చైర్మన్ యాండ్రాపు తిరుపతిరావు ఇటీవల అనారోగ్యానికి గురి కాగా ఎమ్మెల్యే అలజంగి జోగారావు శనివారం పరామర్శించి యోగ క్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఎమ్మెల్యే ఆయన ఆరోగ్య సమాచారం అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట మండల పార్టీ అధ్యక్షుడు బొమ్మి రమేష్, ఎంపీపీ ప్రతినిధి మజ్జి శేఖర్, జెడ్పీటీసీ ప్రతినిధి బలగ నాగేశ్వరరావు, ఎంపీటీసీ బంకూరు రవికుమార్, సర్పంచ్ జక్కు ప్రవీణ్‌కుమార్ తదితరులు ఉన్నారు.

పీఏసీఎస్ అధ్యక్షుల నియామకం

సీతానగరం: మండలంలోని మూడు పీఏసీఎస్‌లకు నూతన అధ్యక్షులను నియమిస్తూ డివిజనల్ రిజిస్ట్రార్ కార్యాలయం నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయి. ఎమ్మెల్యే అలజంగి జోగారావు కృషితో అంటిపేట పీఏసీఎస్ అధ్యక్షుడిగా బొన్నాడ సత్యనారాయణ, తామరఖండి పీఏసీఎస్ అధ్యక్షుడిగా మూడడ్ల మన్మధరావు, ఆర్.వెంకంపేట పీఏసీఎస్ అధ్యక్షుడిగా రెడ్డి సూర్యనారాయణను నియమిస్తూ రాష్ట్ర సహకార సంఘాల అధికారి నుంచి ఉత్తర్వులు వచ్చాయి. వీరంతా ఎమ్మెల్యే అలజంగి జోగారావుకు కృతజ్ఞతలు తెలిపారు.

గురుకుల ప్రవేశ పరీక్ష నేడు

సీతానగరం: మండలంలోని జోగింపేట డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకులంలో ఐదో తరగతి, ఇంటర్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశాలకు సంబంధించి ఆదివారం పరీక్ష నిర్వహించనున్నట్టు ప్రిన్సిపాల్ కె.ఈశ్వరరావు శనివారం తెలిపారు. ఐదో తరగతి ప్రవేశ పరీక్ష ఉదయం 10 గంటల నుంచి 12.30 గంటల వరకు, ఇంటర్ ప్రవేశ పరీక్ష మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు జరుగుతుందని పేర్కొన్నారు. విద్యార్థులు పరీక్ష కేంద్రానికి గంట ముందు హాజరు కావాలని సూచించారు.

వేగవంతంగా భూసర్వే



మాట్లాడుతున్న తహసీల్దార్ రమణ

సీతానగరం: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా భావిస్తున్న జగనన్న శాశ్వత భూరక్ష – భూ హక్కు పథకంలో చేపట్టిన భూ సర్వే వేగవంతం చేయాలని తహసీల్దార్ ఎన్వీ రమణ అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో రీసర్వేకు సంబంధించి ఉప తహసీల్దార్ పి.చిట్టమ్మ ఆధ్వర్యంలో వీఆర్‌ఓలు, సచివాలయ సర్వేయర్లతో శనివారం సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రీసర్వేలో భూముల గుర్తింపు సరిగా ఉండాలని, ఎటువంటి వివాదాలకు తావు లేకుండా చూడాలన్నారు. సమావేశంలో ఆర్ఐ పి.కరుణాకర్, వీఆర్‌ఓలు, సచివాలయ సర్వేయర్లు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ విధానాలను తిప్పికొట్టాలి



మాట్లాడుతున్న సీపీఎం నాయకుడు ఈశ్వరరావు

సీతానగరం: కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను వ్యతిరేకించాలని సీపీఎం మండల కార్యదర్శి ఆర్.ఈశ్వరరావు అన్నారు. బుద్దిపేట, పెదబోగిలి గ్రామాలకు చెందిన ఉపాధి వేతనదారులతో ఆయన శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని మోదీ ప్రభుత్వం ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తుందన్నారు. సీఐటీయూ డివిజన్ కార్యదర్శి జీవీ రమణ, సీఐటీయూ అనుబంధ సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

పద్మా పేరంటాల గుడి పునఃప్రతిష్ఠ



పునఃప్రతిష్ఠ కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు

పార్వతీపురం టౌన్: మండలంలోని నర్సిపురం సమీపంలో ప్రధాన రహదారి వద్ద పద్మా పేరంటాల ఆలయ పునఃప్రతిష్ఠ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ ప్రాంత వాసులు సుఖ సంతోషాలతో ఉండాలని పండితులు వేదమంత్రోచ్ఛరణలతో పూజలు నిర్వహించారు. ఇక నుంచి ఆలయ పూజలు నిర్వహిస్తారని కమిటీ సభ్యులు తెలిపారు. అనంతరం భక్తులందరికీ అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు.

జగనన్నతోనే స్వరాజ్యం..

- డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర
- ఉత్సాహంగా 'జగనన్నే మా భవిష్యత్'



ఇంటికి స్టిక్కర్ అతికిస్తున్న పార్టీ నేతలతో డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర



పథకాలపై మహిళలకు వివరిస్తున్న డిప్యూటీ సీఎం రాజన్నదొర, తదితరులు

మక్కువ: ముఖ్యమంత్రి జగనన్నతోనే స్వరాజ్యం సిద్ధిస్తుందని ఉప ముఖ్యమంత్రి, గిరిజన శాఖా మంత్రి పీడిక రాజన్నదొర అన్నారు. మండల కేంద్రంలోని యాదవవీధిలో జెడ్పీటీసీ సభ్యుడు మావుడి శ్రీనివాసరావు, వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు మావుడి రంగునాయుడు ఆధ్వర్యంలో 'జగనన్నే మా భవిష్యత్తు – మా నమ్మకం నువ్వే జగన్' కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి రాజన్నదొర, ఇతర నాయకులతో కలిసి ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల అమలుపై ఆరా తీశారు. ఒక్కో ఇంటికి సంక్షేమ పథకాల వల్ల కలిగిన లబ్ధిని వివరిస్తూ బుక్‌లెట్లు పంపిణీ చేశారు. అలాగే ప్రభుత్వ పాలనపై అన్నివర్గాల ప్రజల అభిప్రాయాలు సేకరించారు. నాలుగేళ్ల పాలనలో సీఎం జగన్ మోహన్ రెడ్డి ఎన్నో మంచి, మంచి సంక్షేమ పథకాలు అమలు చేశారని, ఎటువంటి అవినీతి లేకుండా నేరుగా బ్యాంక్ ఖాతాలకే పథకాల లబ్ధి జమైందని ఈ సందర్భంగా పలువురు చెప్పడంతో మంత్రి, తదితరులు ఆనందం వ్యక్తం చేశారు. మనసున్న మారాజు జగనన్నను మరోసారి ముఖ్యమంత్రిగా గెలిపించుకుంటామన్నారు. అనంతరం ఇళ్ల యజమానుల అనుమతితో జగనన్న స్టిక్కర్లను గోడలకు అతికించారు. కార్యక్రమంలో మక్కువ, సాలూరు మండలాలకు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు, డీసీసీబీ డైరెక్టర్ మావుడి తిరుపతినాయుడు, తేలు శ్రీరాములనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

జగనన్నతోనే అన్ని వర్గాల అభివృద్ధి



ప్రజలకు ప్రభుత్వ పథకాల బుక్‌లెట్ అందజేసి వివరిస్తున్న ఎమ్మెల్యే జోగారావు

- ఎమ్మెల్యే అలజంగి జోగారావు

పార్వతీపురం టౌన్: అన్ని వర్గాల అభివృద్ధి జగనన్నతోనే సాధ్యమని, అర్హతే ప్రామాణికంగా ప్రజలకు లబ్ధి చేకూరుస్తున్న ఏకైక ప్రభుత్వం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వమని ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం మండలంలోని వెంకంపేట గ్రామంలో శనివారం నిర్వహించారు. ప్రతి గడప వద్దకు వెళ్లి ప్రజలను కలుసుకుని వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకుని ఇంతవరకు ప్రభుత్వం వారికి చేకూర్చిన లబ్ధిని, సంక్షేమ పథకాలను ఎమ్మెల్యే తెలియజేశారు. ఏమైనా సమస్యలు ఉంటే అడిగి తెలుసుకుని వాటి పరిష్కారానికి అధికారులతో మాట్లాడి చర్యలు తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన అమ్మ ఒడి వచ్చిందా, రైతు భరోసా వచ్చిందా, పింఛన్ ఇంటి వద్దకే వచ్చి ఇస్తున్నారా అంటూ ఆరా తీశారు. సంక్షేమ పథకాల అమలు తీరును వివరించిన ఎమ్మెల్యే లబ్ధిదారులకు అందుతున్నాయా.. లేదా.. అర్హులకు ఏదైనా అన్యాయం జరుగుతుందా తదితర విషయాలు తెలుసుకొనేందుకే తాము వచ్చామని వివరించారు. లబ్ధిదారులు సంతృప్తి చెందడంతో ఎమ్మెల్యే సంతోషం వ్యక్తం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అర్హతే ప్రామాణికంగా ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందిస్తున్నామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమాన్ని, అభివృద్ధిని సమపాళ్లలో అందిస్తుందని తెలిపారు. సచివాలయానికి రూ.20లక్షల నిధులను ప్రభుత్వం కేటాయించిందని, వాటి ద్వారా పంచాయతీల్లో మౌలిక వసతుల కల్పన చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ మజ్జి శోభారాణి, జెడ్పీటీసీ బలగ రేవతమ్మ, ఏఎంసీ చైర్మన్ భాగ్యలక్ష్మి, వైస్ ఎంపీపీ శిద్దా జగన్నాధరావు, మండల పార్టీ అధ్యక్షుడు బొమ్మి రమేష్, పీఏసీఎస్ చైర్మన్ తీళ్ల శివున్నాయుడు, స్థానిక సర్పంచ్ తీళ్ల కృష్ణారావు, ఎంపీటీసీ సభ్యులు, స్టేట్ కార్పొరేషన్ డైరెక్టర్లు, ఏఎంసీ డైరెక్టర్లు, కోఆప్షన్ సభ్యులు, నాయకులు, కార్యకర్తలు జేసీఎస్ కన్వీనర్, సచివాలయం కన్వీనర్లు, గృహసారథులు, సచివాలయం ఉద్యోగులు, వలంటీర్లు, స్థానికులు పాల్గొన్నారు.

సస్పెన్షన్ల రద్దు కోసం ఆందోళన



నిరసనలో పాల్గొన్న ఉపాధ్యాయ సంఘాల నేతలు, ఉపాధ్యాయులు

పార్వతీపురం టౌన్: రాష్ట్ర విద్యా శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్‌ప్రకాష్ విద్యా శాఖాధికారులపై తీసుకున్న సస్పెన్షన్ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని, ఉద్యోగులను విధుల్లోకి తీసుకోవాలని యూటీఎఫ్, ఏపీటీఎఫ్, ఏపీ ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘాల నాయకులు కోర్టు జంక్షన్ వద్ద శనివారం ఆందోళన చేశారు. అనంతరం బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు ఇవ్వలేదనే కారణంగా విద్యా శాఖలో పని చేస్తున్న డీఈఓ, కేజీబీవీ ఎస్ఓ, అసిస్టెంట్ జీసీడీఓ, ఎంఈఓలను సస్పెండ్ చేయడం సరికాదన్నారు. పుస్తకాలను పూర్తి స్థాయిలో సరఫరా చేయకపోతే విద్యార్థులకు ఎలా పంపిణీ చేస్తారని ప్రశ్నించారు. వీరఘట్టం కేజీబీవీ పాఠశాలకు శ్రీకాకుళం జిల్లా నుంచి పాఠ్య పుస్తకాల కోసం ప్రతిపాదనలు పంపారన్నారు. శ్రీకాకుళం జిల్లా నుంచి పంపిణీ అయిన పుస్తకాల పంపిణీకి పార్వతీపురం మన్యం జిల్లా అధికారులను బాధ్యులను చేయడం ఎంత వరకు సమంజసమన్నారు. తక్షణమే సస్పెండ్ ఉత్తర్వులను వెనక్కి తీసుకొని విధుల్లోకి తీసుకోవాలని కోరారు. యూటీఎఫ్, ఏపీటీఎఫ్ నాయకులు జి.మురళీమోహన్, బాలకృష్ణతో పాటు ఏపీ ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సామల సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

రైతులు 30లోగా దరఖాస్తు చేసుకోవాలి

భామిని: ఆర్ఓఎఫ్ఆర్ పట్టాలు పొందిన గిరిజన రైతులు ఈనెల 30లోగా రైతుభరోసా కోసం దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి కె.సింహాచలం అన్నారు. మండలంలోని పోలవరం గ్రామంలో సర్పంచ్ బిడ్డిక నారాయణ ఆధ్వర్యంలో రైతులతో శనివారం సమావేశం నిర్వహించారు. గిరిజన కుటుంబంలో వ్యక్తిగతంగా ఆర్ఓఎఫ్ఆర్ పట్టా ఉన్న రైతులు కూడా రైతుభరోసా పొందేందుకు అర్హులుగా పేర్కొన్నారు. ఇప్పటివరకు రైతుభరోసా పొందని పల్లం ప్రాంత రైతులు కూడా ఆర్‌బీకేల్లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. సమావేశంలో వ్యవసాయ సహాయకులు గొర్లె ఎలీసా, భవానీ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఏఓ సింహాచలం, సర్పంచ్ నారాయణ

బహిరంగ మద్యపానం నేరం

పాలకొండ రూరల్:

బహిరంగ మద్యపానం చట్టరీత్యా నేరమని సీఐ మురళీధర్ అన్నారు. పాలకొండ–సీతంపేట రహదారిలో వెలగవాడ, పరశరాంపురం, సిరికొండ ప్రాంతాల్లో శనివారం డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహించారు. మద్యం తాగి వాహనాలు నడిపేవారితో పాటు ఆరుబయట మద్యం తాగుతున్నవారిని గుర్తించి కేసులు నమోదు చేశారు. ఎస్సై బి.శివప్రసాద్, ఏఎస్సై శంకరరావు, పోలీసు సిబ్బంది ఉన్నారు.

నేడు అంబేడ్కర్ విగ్రహావిష్కరణ

బలిజిపేట: మండలంలోని పలగర గుడివాడ కాలనీలో అంబేడ్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అంబేడ్కర్ విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమం ఆదివారం జరగనున్నట్టు నిర్వాహకులు తెలిపారు. యువజన సంఘం సభ్యులు, స్థానికులు పాల్గొనాలని కోరారు.

నేడు నవోదయ మోడల్ టెస్ట్

జియ్యమ్మవలస: మండలంలోని పెదమేరంగి కూడలిలో ఉన్న తిరుమలసాయి హైస్కూల్‌లో ఆదివారం ఉదయం నవోదయ మోడల్ పరీక్షను నిర్వహించనున్నట్లు హెచ్‌ఎం కర్రి శ్రీరామ్మూర్తి తెలిపారు. నవో దయ ప్రవేశ పరీక్షకు హాజరయ్యే విద్యార్థులు పరీక్ష లో ఎక్కువ మార్కులు సాధించేందుకు ఈ మోడల్ టెస్ట్ ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం పెంపొందించేందుకు ఈ పరీక్ష నిర్వహిస్తున్నట్లు చెప్పారు. మోడల్ టెస్ట్‌కు హాజరయ్యే విద్యార్థులకు, వారి సహాయకులకు భోజన వసతి ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. అలాగే మొదటి 10 ర్యాంకులు సాధించిన విద్యార్థులకు బహుమతి ప్రదానం ఉంటుందన్నారు.

చిన్నారి వైద్యానికి సీఎం సాయం



సీఎంఆర్ఎఫ్ చెక్కును అందజేస్తున్న పాలవలస రాజశేఖరం

పాలకొండ: అనారోగ్యంతో బాధపడుతున్న ఓ చిన్నారికి ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి రూ. 4.50 లక్షలు మంజూరైంది. ఈ మొత్తానికి సంబంధించిన చెక్కును వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకు డు పాలవలస రాజశేఖరం శనివారం చిన్నారి తండ్రి కి అందజేశారు. వీరఘట్టం మండలం తలవరం గ్రామానికి చెందిన దేవకివాడ రాజేష్ ఖన్నా మూడేళ్ల కుమార్తె గీతిక హయాతి నరములకు సంబంధించిన వ్యాధితో బాధపడుతోంది. ఈ విషయమై ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లడంతో సీఎం సహాయ నిధి నుంచి రూ. 4.50 లక్షలు మంజూరు చేశారు. ఈ చిన్నారికి ఆదివారం ఆపరేషన్ జరుగుతుందని చిన్నారి తల్లిదండ్రులు తెలిపారు.

ఉత్తమ క్రీడాకారులుగా తీర్చిదిద్దాలి

- శాప్ సీఈఓ రామ్‌గోపాల్

సీతంపేట: గిరిజన ప్రాంతాల్లో నైపుణ్యం గల క్రీడాకారులను తయారు చేయాలని విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల శాప్ (స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఏపీ) సీఈఓ బి.రామ్ గోపాల్ అన్నారు. స్థానిక గ్రీన్‌ఫీల్డ్ స్టేడియాన్ని శనివారం ఆయన సందర్శించారు. ఇటీవల నిర్మించిన వాలీబాల్, బాస్కెట్‌బాల్, బ్యాడ్మింటన్ సింథటిక్ కోర్టు, జిమ్‌ను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. గిరిజన విద్యార్థుల్లో క్రీడా నైపుణ్యాలను గుర్తించి తగిన శిక్షణ ఇవ్వాలని, వేసవి శిక్షణ శిబిరాలు ప్రారంభించాలని ఐటీడీఏ స్పోర్ట్స్ ఇన్‌చార్జ్ జాకాబ్ దయానంద్‌కు సూచించారు. రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీలకు విద్యార్థులను పంపించే విధంగా తయారు చేయాలన్నారు. క్రీడా సామగ్రి అవసరమైతే ప్రతిపాదనలు పెట్టాలన్నారు.

సమగ్ర సర్వేతో భూరక్ష

పాలకొండ రూరల్: భూముల సమగ్ర రీసర్వేతో భూమి యజమాని హక్కులకు రక్షణ లభిస్తుందని చిన్నకోటిపల్లి సర్పంచ్ సింగంవలస మంగామణి అన్నారు. పంచాయతీ పరిధిలో ఇటీవల చేపట్టిన భూముల సర్వే ప్రాప్తికి శనివారం సర్వేరాళ్లను ఏర్పాటు చేశారు. గ్రామస్తులు, రైతుల సమక్షంలో రాళ్లు ఏర్పాటు చేసినట్లు సర్వే సిబ్బంది చెప్పారు. అలాగే లుంబూరులో సర్పంచ్ తిర్లంగి ఉపేంద్రకుమార్ నేతృత్వంలో సర్వేరాళ్లు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో మండల సర్వేయర్ వెంకటరావు, వీఆర్వో శ్రీనివాసరావు, సచివాలయం సర్వేయర్ శ్రీనివాస్, త్రినాథులు తదిరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో రమజాన్



అప్పయ్యపేటలో నమాజ్ చేస్తున్న ముస్లిం సోదరులు

సీతానగరం: రమజాన్ సందర్భంగా ముస్లిం సోదరులు భక్తిశ్రద్ధలతో శనివారం ప్రార్థనలు చేశారు. స్థానిక మసీదులో ఇమామ్ షేక్ రసూల్ ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా రసూల్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సత్ప్రవర్తన కలిగి అల్లా అడుగుజాడల్లో నడవాలన్నారు.

కార్యక్రమంలో ఎస్‌కే ఆలీ, షేక్ భషీర్, ఉమర్, మెహబూబ్, షాజహాన్, ఇంతియాజ్, అన్వర్ తదితరులు పాల్గొన్నారు.

టీకాలు వేసేటప్పుడు జాగ్రత్తలు పాటించండి

- డీఐఓ జగన్‌మోహనరావు

పార్వతీపురం టౌన్: వ్యాధి నిరోధక టీకాల నిర్వహణలో మార్గదర్శకాలను వైద్య సిబ్బంది తప్పనిసరిగా పాటించాలని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి(డీఐఓ) టి.జగన్‌మోహనరావు సూచించారు. పట్టణంలోని 22, 23 వార్డుల్లో చిన్నారుల టీకా కార్యక్రమాన్ని ఆయన శనివారం ఆయన పరిశీలించారు. వ్యాక్సిన్ ప్రారంభించిన సమయాన్ని, వీవీఎం(శీతోష్ణస్థితి) వయల్‌పై పరిశీలించారు. అర్హుల జాబితా, అత్యవసర మందుల కిట్, ఉపయోగించిన సిరంజీలు, ఆర్సీహెచ్ రిజిస్టర్లు, టీకా కార్డుల్లో తేదీలు, మాతా శిశు ఆరోగ్య కార్యక్రమాలపై అవగాహన కల్పించే పోస్టర్లు, బ్యానర్లు తదితర వాటిని పరిశీలించారు. వైద్య సిబ్బంది చిన్నారులకు, గర్భిణులకు టీకా వేస్తున్న విధానాన్ని నిశితంగా పరిశీలించి నిబంధనలను తప్పకుండా పాటించాలన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ బి.పుష్ప, ఏఎన్ఎంలు ఉమామహేశ్వరి, విజయ, అంగన్‌వాడీ సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉత్సాహంగా 'జగనన్నే మా భవిష్యత్తు'



జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమంలో పాల్గొన్న టిడ్కో చైర్మన్ జమ్మాన ప్రసన్నకుమార్

పార్వతీపురం టౌన్: పట్టణంలోని 22వ వార్డులో ఏపీ టిడ్కో చైర్మన్ జమ్మాన ప్రసన్నకుమార్ ఆధ్వర్యంలో శనివారం జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ పని తీరుపై జగనన్నే మా భవిష్యత్తు పేరుతో గృహ సారథులు, సచివాలయ కన్వీనర్లు, వార్డ్ వాలంటీర్లతో కలిసి నిర్వహించే మెగా ఉద్యమానికి నాంది పలికిందన్నారు. ప్రభుత్వం చేస్తున్నటువంటి కృషిని అందరికీ తెలియజేసి రాబోయే రోజుల్లో కూడా ముఖ్యమంత్రిగా జగన్ మోహన్‌రెడ్డి ఉండాలనే ఆకాంక్షతో పెద్ద ఎత్తున ప్రజలు 8296082960 మొబైల్ నంబరుకు మిస్సిడ్ కాల్ ఇవ్వడం జరుగుతుందన్నారు. దీనిని చూసి కొంత మంది ప్రతిపక్ష నేతలు ఓర్వలేకపోతున్నారని ప్రజలకు వివరించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

సచివాలయ నిర్మాణ పనుల పరిశీలన

సీతానగరం: మండలంలోని గాదెలవలస సచివాలయ భవన నిర్మాణ పనులు చురుగ్గా జరుగుతున్నాయని ఇంజినీరింగ్ సహాయకులు జగన్‌మోహన్ తెలిపారు. పనులను ఆయన శనివారం పరిశీలించారు. పనులను ఈ నెలాఖరులోగా పూర్తి చేసి ఎమ్మెల్యే అలజంగి జోగారావు చేతుల మీదుగా ప్రారంభించేందుకు చర్యలు చేపట్టినట్టు తెలిపారు. సచివాలయ భవనం, విలేజ్ క్లినిక్ భవనం, రైతు భరోసా కేంద్రం భవన నిర్మాణ పనులు వేగవంతం చేయాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. నాణ్యతలో రాజీ పడొద్దని సూచించారు. సర్పంచ్ బి.అన్నపూర్ణమ్మ మాట్లాడుతూ నెలాఖరు నాటికి పనులు పూర్తి చేయిస్తామన్నారు.



నిర్మాణంలో ఉన్న గాదెలవలస సచివాలయ భవనం

నిబంధనలు పాటించకుంటే చర్యలు తప్పవు



వాహనచోదకులకు అవగాహన కల్పిస్తున్న ట్రాఫిక్ ఎస్ఐ

పార్వతీపురం టౌన్: వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని లేకుంటే చర్యలు తప్పవని ట్రాఫిక్ ఎస్ఐ పాపారావు అన్నారు. పట్టణంలోని ఆర్టీసీ కాంప్లెక్స్ కూడలి వద్ద నో యాక్సిడెంట్ డే కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. రోడ్డు ప్రమాదాలు జరగకుండా వాహన చోదకులకు, ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ ఒక్కరూ విధిగా ట్రాఫిక్ నియమాలు పాటించాలని సూచించారు. ఆటోల్లో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కిస్తే చర్యలు తప్పవని అన్నారు. ద్విచక్ర వాహన చోదకులు పత్రాలను తమ వెంట ఉంచుకోవాలని సూచించారు. ఏఎస్ఐ రాజారావు, కిశోర్, సంవత్, ఆటో డ్రైవర్లు, వాహన చోదకులు పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు



పైలెట్ వాటర్‌స్కీమ్‌ను ప్రారంభిస్తున్న ఉప ముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర

- మంత్రి పీడిక రాజన్నదొర

సాలూరు: ప్రజలకు తాగునీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నామని, అందులో భాగంగా పైలెట్ వాటర్‌స్కీమ్‌లకు శ్రీకారం చుట్టామని ఉప ముఖ్యమంత్రి, గిరిజన సంక్షేమ శాఖా మంత్రి పీడిక రాజన్నదొర అన్నారు. పట్టణంలోని 1, 26 వార్డులలో సుమారు రెండున్నర లక్షల రుపాయలతో నిర్మించిన పైలెట్ వాటర్‌స్కీమ్ పథకాన్ని శనివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పార్వతీపురం – మన్యం, విజయనగరం జిల్లాల్లో తాగునీటి సమస్య పెద్దగా లేని మున్సిపాలిటీ సాలూరేనని చెప్పారు. కాగా మున్సిపాలిటీకి దూరంగా, కొంత ఎత్తులో ఉండే ప్రాంతాల్లో నివసించే ప్రజలు తాగునీటి ఇబ్బందులు పడుతున్న విషయాన్ని గుర్తించామని, అటువంటి వారికి కోసం పైలెట్ వాటర్‌స్కీమ్ పథకాలకు శ్రీకారం చుట్టామన్నారు. మున్సిపాలిటిలోని 29 వార్డుల్లోనూ అవసరం మేరకు వాటర్‌స్కీమ్‌లు ఏర్పాటు చేస్తామని తెలిపారు. వీటి నిర్వహణపై మున్సిపల్ అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని కమిషనర్ శంకరరావును ఆదేశించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ పువ్వల ఈశ్వరమ్మ, మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ జర్జాపు దీప్తి, వైస్ చైర్మన్ వంగపండు అప్పలనాయుడు, కౌన్సిలర్లు, నాయకులు కర్రి సన్యాసమ్మ, ఈశ్వరరావు, మాధవరావు, కర్రి అప్పలస్వామి, పిరిడి రామకృష్ణ, కొల్లి రమణ, తదితరులు పాల్గొన్నారు.